
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

ఆదివారం 14 సెప్టెంబరు 2025



అభివృద్ధికి బాట

మచిలీపట్నంలో క్రాస్ క్లోవర్ లీఫ్ నమూనా రహదారి నిర్మాణం!

56 ఎకరాల భూమి సేకరణకు ప్రతిపాదనలు

మచిలీపట్నంలో క్రాస్ క్లోవర్ లీఫ్ నమూనా రహదారి నిర్మాణానికి రంగం సిద్ధమైంది. మచిలీపట్నం-విజయవాడ, కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారులు కలిసే ప్రాంతంలో నిర్మించనున్నారు. రూ.574 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ పనులకు అవసరమైన 56 ఎకరాల భూమి సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో రహదారి విస్తరణకు అడుగులు పడుతున్నాయి.

6

- రూ.574 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులు
- రహదారి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- జాతీయ రహదారి విస్తరణకు రంగం సిద్ధం!
- మచిలీపట్నం శివారులో కలవనున్న మచిలీపట్నం-విజయవాడ, కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి-65, కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారి 216 మచిలీపట్నంలో కలిసే ప్రాంతంలో క్రాస్ క్లోవర్ లీఫ్ నమూనా రహదారి నిర్మాణం చేయనున్నారు. మచిలీపట్నం పోర్టు నుంచి నూతనంగా నిర్మాణం చేసే రహదారి మచిలీపట్నం శివారులో ఉన్న హర్ష కాలేజీ వద్ద 216 జాతీయ రహదారికి కలుస్తుంది. ఇక్కడి నుంచి ఎస్ఎన్ గొల్లపాలెం వరకు జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించనున్నారు. జాతీయ రహదారులు 216, 65 మచిలీపట్నం వద్ద కలిసే ఫ్లైఓవర్ వద్ద మచిలీపట్నం పోర్టుకు వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఎస్ఎన్ గొల్లపాలెం నుంచి హర్ష కాలేజీ వరకు సుమారు 3.5 కిలో మీటర్ల మేర విస్తరించే ప్రతిపాదనలను మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ (మోర్త్)తయారు చేసింది. ఈ ప్రతిపాదనలకు కేంద్రప్రభుత్వం కూడా ఇటీవల ఆమోదం తెలిపింది. దీంతో రెవెన్యూ అధికారులు భూసేకరణకు రంగం సిద్ధం చేశారు.

మచిలీపట్నంలో నిర్మించనున్న క్రాస్ క్లోవర్ లీఫ్ నమూనా రహదారి



త్వరలో భూసేకరణకు నోటిఫికేషన్

మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి-65కి ఎస్ఎన్‌గొల్లపాలెం సమీపంలో కత్తిపూడి- ఒంగోలు జాతీయ రహదారి-216 ఫ్లైఓవర్ వద్ద కలుస్తుంది. మచిలీపట్నం పోర్టు నుంచి ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల విస్తరణకు మోర్త్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ ప్రతిపాదనలకు మిగతా 6లో..

పోర్టుకు అనుబంధంగా జాతీయ రహదారుల విస్తరణ

మచిలీపట్నం పోర్టు నిర్మాణం 2026 అక్టోబరు నాటికి పూర్తి చేసి ఓడలను ఇక్కడకు తీసుకువస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. పోర్టు నిర్మాణం పూర్తయితే సరుకుల ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం వందలాది వాహనాలు రోజూ ఈ ప్రాంతానికి రాకపోకలు సాగించాలి. ప్రస్తుతం ఉన్న రహదారులపై వాహనాల రద్దీ పెరిగితే ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి గతంలో మోర్త్ అధికారులతో చర్చలు జరిపారు. మచిలీపట్నం-విజయవాడ, కత్తిపూడి- ఒంగోలు జాతీయ రహదారులను మచిలీపట్నం పోర్టు, పరిసర ప్రాంతాల్లో విస్తరించేందుకు తన వంతుగా కృషి చేశారు. ఈ నేపథ్యంలో మచిలీపట్నంలో జాతీయ రహదారుల విస్తరణలో కదలిక వచ్చినట్లయింది.

ఉచిత టికెట్ల రగడ!

గతేడాది దసరా ఉత్సవాల్లో ప్రొటోకాల్, వీవీఐపీ, వీఐపీలకు పంపిణీ

- నిర్దేశించిన సమయానికి రాకుండా ఇష్టారాజ్యంగా దర్శనాలు
- మళ్లీ ఈ ఏడాది ఉచిత టికెట్లు కావాలని సమన్వయశాఖల సూచన
- ఇప్పటికే వీఐపీల కోసం రూ. 500 టికెట్లు రద్దు
- తిరుమలను చూసైనా నేర్చుకోవడంలేదని పలువురి విమర్శ
- నేడు మంత్రి సమక్షంలో సమన్వయశాఖల సమావేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చే వారు ఎవరైనా సరే ఖచ్చితంగా టికెట్ కొనుగోలు చేయాల్సిందే. కానీ రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చే సరికి మాత్రం దర్శనాలు ఉచితంగా కావాలని ప్రొటోకాల్, వీవీఐపీ, వీఐపీలు కోరుకుంటున్నారు. గతేడాది ప్రొటోకాల్, వీవీఐపీలకు జీరో ఫేర్ టికెట్లను దేవస్థానం జారీ చేసింది. దీని వల్ల దేవస్థానం రూ.2 కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోయింది. ఈ దసరా ఉత్సవాలలో కూడా ఉచిత టికెట్లను ఇవ్వాలని పలుశాఖలు దేవస్థానానికి సూచిస్తున్నాయి. సమన్వయ కమిటీ సమావేశంలో భక్తుల ఇబ్బందులు, మిగతా 6లో..



ఇష్టారాజ్యంగా పైరవీలు!

దసరా ఉత్సవాలలో వీఐపీ అనే అర్థమే మారిపోతుంది. గుడికి వచ్చేవాళ్లంతా వీఐపీలే. ఎవరికి వారు వీఐపీ దర్శనాలకు ఎగబడుతుంటారు. పైరవీలు చేస్తారు. రాజకీయ ఒత్తిళ్లు తీసుకువస్తారు. రాజకీయ నాయకులు కూడా ఇష్టానుసారంగా తమ అనుచరులను కొండమీదకు పంపుతారు. సమన్వయ శాఖలన్నీ తమ కుటుంబాలనే కాకుండా బంధువర్గాలకు వీఐపీల పేరుతో దర్శనాలు చేయిస్తుంటాయి. ప్రొటోకాల్‌లో కూడా ఇష్టానుసారం దర్శనాలు జరుగుతున్నాయి. వీఐపీ సంగతి చెప్పనక్కర లేదు. ఈ రెండింటికీ ధరతో కూడిన టికెట్లను తప్పనిసరి చేస్తేనే అనధికారిక దర్శనాలను నియంత్రించటం సాధ్యమవుతుంది. తిరుపతిలో అనుసరిస్తున్న విధానాన్ని విజయవాడలో అమలు చేయటం ద్వారా భక్తులందరికీ న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

కృష్ణా ఎస్పీగా విద్యాసాగర్‌నాయుడు



మచిలీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా వాసన విద్యాసాగర్ నాయుడు నియమితులయ్యారు. రాష్ట్రంలోని పలు జిల్లాల ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న విద్యాసాగర్ నాయుడు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు జిల్లా ఎస్పీగా పనిచేసిన ఆర్.గంగాధరరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

పోర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రవాణ, ఆర్అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు



వచ్చే ఏడాది అక్టోబరుకు పోర్టు సిద్ధం

ఆర్ అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

మచిలీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసి 2026 అక్టోబరులో పోర్టురవాణా కార్యకలాపాలు ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణ, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆయన అధికారులతో కలిసి మచిలీపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నార్త్, సౌత్ బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ బెర్తులు, రహదారులు, పరిపాలన భవనాలు, గిడ్డంగుల నిర్మాణాలు తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏపీ మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్యతో కలిసి పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన ఇప్పటివరకూ ఆయా పనుల పురోగతి ఎంతవరకు పూర్తయింది అనే అంశంపై సమీక్షించారు. పెద్దమొత్తంలో యంత్రాలు, మ్యాన్‌పవర్ పెంచి నిర్ధేశించిన సమయానికి పోర్టు పనులను పూర్తిచేయాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అనంతరం కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ, రూ.5,500 కోట్ల వ్యయంతో చేపట్టిన మచిలీపట్నం పోర్టునిర్మాణ పనులను వేగవంతం చేసి 2026 అక్టోబరు నాటికి పోర్టు రవాణా కార్యకలాపాలను ప్రారంభించాలనే కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి ఉన్నారని తెలిపారు. మచిలీపట్నం పోర్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవసరాలను తీర్చడంతోపాటు మిగతా 6లో..

పట్టని పనులు!

జల్ జీవన్ మిషన్‌పై అలక్ష్యం

- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు
- అన్ని జిల్లాల్లో 300- 350 పనులకు ఆమోదం
- ఉమ్మడి కృష్ణాజిల్లాకు మాత్రం 14 పనులే దక్కాయి..
- అవి కూడా చెంచులు నివాసం ఉండే ప్రాంతాలు కావటంతో తప్పనిసరిగా ఇచ్చినవే!
- రూ.6,063 కోట్ల వ్యయంతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు డీపీఆర్ తయారీ
- ఆమోదం పొంది.. మనకు శాంక్షన్ రావటానికి మరింత సమయం
- జిల్లాలో పనులు లేక పొరుగు జిల్లాలకు కాంట్రాక్టర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామాల్లో ప్రతి గృహానికి కుళాయి ద్వారా తాగునీరు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను ప్రారంభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల భాగస్వామ్యంతో నడుస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకానికి రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయలేదు. దీంతో చాలా పనులు ఆగిపోయాయి. అసంపూర్తిగా ఎక్కడివక్కడ ఉండి పోయాయి. వీటిలో ఎంతో ప్రాధాన్యమైన పనులు కూడా కొన్ని ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక.. పనుల ప్రాధాన్యతను గుర్తించి పలు జిల్లాలు కొన్ని పనులను ప్రభుత్వానికి ప్రతిపాదనలుగా సమర్పించి, వాటికి ఆమోదం తెచ్చుకున్నాయి. పొరుగున ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లా 300 పైబడి పనులను తిరిగి తెచ్చుకుంది. ఎక్కడో దూరాన ఉండే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కూడా 300 పైబడి పనులను తిరిగి సాధించుకుని వాటిని చేపడుతోంది. ఇక్కడే ఉన్న ఉమ్మడి కృష్ణా జిల్లా పట్టుమని 100 పనులను కూడా తెచ్చుకో లేకపోయింది. కేవలం మిగతా 6లో..



> జల్ జీవన్ మిషన్‌ను అందిపుచ్చుకోవడంలో ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం తడబడుతోంది. ఉన్నతాధికారుల బాధ్యతారాహిత్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా ఇతర జిల్లాల కంటే మన జిల్లా బాగా వెనుకబడింది. ఒక్కో జిల్లా 300 పనులు చొప్పున దక్కించుకుంటే మన జిల్లాకు కేవలం 14 తాగునీటి పైపులైన్ల పనులే మంజూరయ్యాయి. ఇవి కూడా చెంచులు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు కేంద్రం తప్పనిసరిగా ఇచ్చే పనులు కావటం గమనార్హం.

పొరుగు జిల్లాలకు తరలిన కాంట్రాక్టర్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పనులు లేకపోవటంతో ఇక్కడి కాంట్రాక్టర్లు ఇతర జిల్లాలకు తరలి వెళ్లిపోయారు. అక్కడ పనులు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులే కారణమని విమర్శలు వస్తున్నాయి.

మచిలీపట్నం లక్ష్మీటాకీస్ సెంటరులో ప్రధాన రహదారిపై వర్షపునీరు



జిల్లాలో భారీ వర్షం

మచిలీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో శనివారం భారీ వర్షం కురిసింది. మచిలీపట్నం, గుడివాడ, మోపిదేవి, అవనిగడ్డలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారులపై భారీగా నీరు నిలిచిపోయింది. సాయంత్రం కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఆదివారం కూడా కోస్తాతీరం వెంబడి భారీ వర్షం కురుస్తుందని వాతావరణశాఖ హెచ్చరించింది. వర్షాలు వరిపైరుకు మేలు చేస్తాయని రైతులు చెబుతున్నారు. సముద్రతీరం వెంబడి మండలాల్లో వరినాట్లు వేస్తుండగా, నాటిన పైరు వర్షాల కారణంగా త్వరితగతిన నిలదొక్కుకుంటుందని రైతులు అంటున్నారు. ఉయ్యూరు మండలంలోని కల్వపాముల తదితర గ్రామాల్లో వరి పొలాలకు నీరందక నెర్రెలిచ్చాయి. ఈ వర్షంతో నీటి కొరత కొంతమేర తీరినట్లయిందని అక్కడి రైతులు చెబుతున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 16,599 కేసుల పరిష్కారం

- బాధితులకు రూ. 83.49 కోట్ల పరిహారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

మచిలీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 16,599 కేసులను పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టులలో 42 బెంచ్‌లను ఏర్పాటు చేసి 15,111 క్రిమినల్ కేసులు, 169 సివిల్ కేసులు, 1,001 చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. 100 మోటారు వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులలో నగదు ఇచ్చేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలు అంగీకరించినట్లు తెలిపారు. 218 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించి అవార్డులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అన్ని కేసులలో బాధితులకు రూ.83.49 కోట్ల మేర నష్టపరిహారం ఇప్పించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

6

- విజయవాడ నుంచి బీచ్‌కు వెళ్తుండగా ఘటన

ఎన్టీఆర్ మెమోరియల్ ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు 21న 6

బాలుర వసతి గృహంలో వంట మాస్టర్‌పై విద్యార్థుల దాడి 8

మూడు రోజుల్లో దసరా పనులు పూర్తి చేయండి : ఈవో

ఎన్టీఆర్ మెమోరియల్ ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు 21న


మాట్లాడుతున్న స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు

గుడివాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ మెమోరియల్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పురుషుల, మహిళల ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఈనెల 21వ తేదీన ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. స్టేడియంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్యేక క్రీడా క్యాలెండర్ రూపొందించామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 21వ తేదీన ఉమ్మడి కృష్ణాజిల్లాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేయించుకున్నారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెం. 85220 99995కు సంప్రదించాలని కోరారు. క్రీడాకారులను మరింత ప్రోత్సహించేలా రాబోయే రోజు ల్లో మరిన్ని పోటీలను నిర్వహిస్తామని యలవర్తి పేర్కొన్నారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ పాల్గొన్నారు.

భార్య, అత్తమామలపై చాకుతో దాడి


గాయపడిన దివ్య

నందివాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ముగ్గురికి గాయాలైన ఘటన కుదరవల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పొలాసివారిపాలెం గ్రామానికి చెందిన సాలి సాయిబాబుకు భార్య దివ్యతో మ నస్పర్థలు రావడంతో కుదరవల్లిలోని పుట్టింటికి వచ్చింది. సాయిబాబు కుదరవల్లి వచ్చి కాపురాని రావాలని కోరాడు. భార్య దివ్య వచ్చేందుకు నిరాకరించటంతో సాయిబాబు తన వెంట తెచ్చుకున్న చాకుతో భార్య దివ్య, అత్తమామలు లంకపల్లి రత్నకుమారి, నీలాంబరంపై దాడి చేశాడు. గాయపడిన ముగ్గురినీ వెంటనే గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గాయపడిన దివ్య వద్ద స్టేట్‌మెంట్ తీసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాడిగడపకు విచారణకు వస్తున్నా..

● ఆంధ్రజ్యోతి కథనానికి విచారణాధికారి స్పందన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కానూరు, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలో అటకెక్కిన విచారణ శీర్షికన ప్రచురితమైన కథనానికి విచారణాధికారి స్పందించారు. ప్రభుత్వం జీవో ఇచ్చి నెలలు కావస్తున్నా విచారణకు రాని అధికారి..నేనొస్తున్నానంటూ తాడిగడప మునిసిపాలిటీకి సమాచారం ఇచ్చారు. ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చినా తనకు కాపీ రాలేదని, తనను ప్రశ్నించిన వారితో చెప్పిన విచారణాధికారి ఎట్టకేలకు విచారణకు సిద్ధమయ్యారు. తాడిగడప మునిసిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగం పరిధిలో జరిగిన అవినీతిపై విచారణ చేసేందుకు ప్రభుత్వం విచారణాకారిగా నియమించిన డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) అడిషనల్ డైరెక్టర్ జీ.వి.జి.ఎస్.వరప్రసాద్ ఈనెల 29న తాడిగడప మునిసిపాలిటీకి వస్తున్నట్లు సమాచారం పంపారు. ఈ విషయాన్ని తాడిగడప కమిషనర్ షేక్ నజీర్ శనివారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. మునిసిపల్ కార్యాలయం టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లోని ఫైళ్లను పరిశీలించడంతోపాటు అవసరమైతే ఫీల్డ్‌కు వెళ్లి విచారణ నిర్వహిస్తారని పేర్కొన్నారు. మూడు, నాలుగు దఫాలుగా విచారణ జరిగిన అనంతరం పూర్తి సమాచారం వచ్చిన తరువాత ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కమిషనర్ షేక్ నజీర్ పేర్కొన్నారు.

నవోదయలో 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరంలో 11వ తగరతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డి. ఏదునందన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తిగల అర్హులైన విద్యార్థులు సెప్టెంబరు 23వ తేదీలోపు జవహర్ నవోదయ విద్యాలయంలో నేరుగా లేదా జెఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వేలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఏదునందన పేర్కొన్నారు.


సీఐటీయూ మహాసభలో మాట్లాడుతున్న ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘ నాయకుడు జి. కిషోర్‌కుమార్

కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని సీఐటీయూ అధ్యక్షుడు ఏ.వి.నాగేశ్వరరావు అన్నారు. కృష్ణాజిల్లా సీఐటీయూ 12వ మహాసభలు జి.కన్వెన్షన్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఏ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, కార్మిక ఉద్యమ నిర్మాణంలో కార్మిక సంఘం, కార్మిక వర్గాల నాయకులు భాగస్వామ్యం కావాలన్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం నాయకుడు జి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు యూనియన్ సాధించిన విజయమన్నారు. ఇటీవల విద్యారంగంలో వస్తున్న మార్పులు ప్రాథమిక విద్యను బలహీనపరుస్తున్నాయన్నారు. ఏఐటీయూసీ నాయకుడు ఫిలిప్ మాట్లాడుతూ, సీఐటీయూ ఉద్యమాలకు సంఘీబావం తెలుపుతున్నామన్నారు. వేదికపై ఆహ్వాన సంఘ అధ్యక్షుడు రావి శ్రీనివాసరావు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఏ.ఉమామహేశ్వరరావు, రమాదేవి, కె. వెంకటేశ్వరరావు, వి. శ్రీధర్, పి. నాగయ్య, ధర్మేంద్ర, కొడాలి శర్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎంప్లాయిమెంట్ విభాగం రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవం

భారతీనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎంప్లాయిమెంట్ విభాగం రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవం అయి నట్లు ఎన్నికల అధికారి తోట కృష్ణ కిషోర్ తెలిపారు. నూతన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డి.మనోహర్, కార్యదర్శిగా ఆర్.రవికుమార్, కోశాధికారిగా రామ్‌మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.దొరబాబు, కార్యవర్గ సభ్యులుగా ఎ.సురేష్ కుమార్, రేవతి, ఎస్.వెంకటేశ్వరరావు, కె.రమాదేవి ఎన్నికయ్యారని తెలిపారు. ముఖ్యఅతిథిగా ఐటీఐ అండ్ డీఎల్‌టీసీ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టగుంట రమేష్ బాబు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.వెంకటరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విషజ్వరాల విజృంభణ

● ఎక్కువ మంది జ్వరం, ఒళ్లు నొప్పులు, గొంతు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వారే ● కలుషిత నీరు, ఆహారమే కారణం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఉభయ జిల్లాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో విషజ్వరాల బారిన పడుతున్నారు. మలేరియా, టైఫాయిడ్‌తో పాటు డెంగ్యూ వ్యాధులతో వచ్చే రోగులతో ప్రభుత్వాసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. జ్వరంతో వైద్యం కోసం వచ్చే వారితో ఆసుపత్రిలోని పలు వార్డులు కిటకిటలాడుతున్నాయి. రోగులకు సరిపడా మంచాలు లేకపోవడంతో వార్డు నడవాలో బెడ్లు వేసి చికిత్స అందిస్తున్నారు. జ్వరాల తీవ్రతను ముందు గుర్తించి ఊహించి నివారణ చర్యలు తీసుకోవాల్సిన వైద్య ఆరోగ్య శాఖ, వీఎంసీ ఆ దిశగా స్పందించడం లేదు. మురుగునీటి కాల్వలు, కుంటల్లో వర్షపు నీరు చేరి నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. కొద్దిపాటి వర్షాలకు విజయవాడలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీరు కలుషితమై ప్రజలు అతి సార (డయేరియా) వ్యాధికి గురైన సం


జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న విజయవాడ ప్రభుత్వాసుపత్రి

గతి తెలిసిందే. ప్రజారోగ్య విభాగం దీనిని గుర్తించి దోమల నివారణకు ఫాగింగ్, నెట్‌ల పంపిణీ చేయడంతో పాటు నీరు కలుషితం అవుతున్న ప్రాంతాలను గుర్తించి వారికి తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వ్యాధుల వ్యాప్తికి దోమలు, ఈగలతో పాటు కలుషితమైన ఆహారం, కలుషిత నీటిని తీసుకోడమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. కలుషిత నీటి నీ తాగడం వల్ల టైఫాయిడ్, కలరా, పచ్చకామెర్లు, విషజ్వరాలు, అమీబియాసిస్, రక్తవిరేచనాలు వ్యాప్తి చెందుతాయని, వీటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వర్షాలూ కారణమే..

కొన్ని రోజులుగా సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కేసులు నమోదవుతున్నాయి. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యాధులు విజృంభించే అవకాశ ముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాలతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పులు కూడా వైరల్ జ్వరాల వ్యాప్తికి కారణమని వైద్యు లు తెలిపారు. చల్లగాలుల వల్ల గొంతు ఇన్‌ఫెక్షన్, గొం తు వాపు, తలనొప్పి, జలుబు, దగ్గు వంటి సమస్యలు వస్తాయన్నారు. వాతావరణ మార్పులతో వైరస్, బాక్టీరియా యాక్టివ్ అయి వ్యాధుల బారినపడేలా చేస్తాయన్నారు. ముఖ్యంగా చిన్నారులు, బాలింతలు, గర్భిణిలు చల్లటిగాలుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

● బ్లీచింగ్ పౌడర్ కలిపి క్లోరినేషన్ చేసిన నీటిని, కొళాయి నీటిని మాత్రమే తాగాలి. నీరు కలుషితమైనట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిది.

● పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించాలి.

● నీరు నిలిచి ఉన్న చోట కిరోసిన్, ఏదైనా ఆయిల్ వేస్తే దోమల వృద్ధిని అరికట్టవచ్చు.

● నీటితొట్టె, టైర్లు, ట్యాంకులు ఉంటే నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

ముందస్తు జాగ్రత్తలు అవశ్యం



ప్రస్తుతం ఆసుపత్రికి వస్తున్నవారిలో అధిక శాతం మంది తీవ్రమైన జ్వరం, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నవారే. కీళ్ల నొప్పులు, కఫం, గొంతునొప్పి వంటి లక్షణాలతో వస్తున్నారు. ఇవన్నీ సీజనల్ వ్యాధుల లక్షణాలే. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతోనే సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చు. ఇంటి పరిసరాల్లో వీలైనంత వరకు తొట్టె, టైర్లు, ఖాళీ డబ్బాలు ఉం డకుండా చూసుకోవాలి. ఒకవేళ ఉన్నా వాటిని వారానికి రెండు రోజులు ఖాళీ చేస్తూ డ్రైడే పాటించాలి. దోమకాట్ల నుంచి రక్షణకు దోమతెరలు, దోమల బ్యాట్లు వాడడం మంచిది. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాలి. ఆహారం ఏ పూటది ఆ పూట వండుకోవడం ఉత్తమం..

- డాక్టర్ కె.ఇందిరా దేవి, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ, విజయవాడ ప్రభుత్వాసుపత్రి

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పండుగల సీజన్ దృష్ట్యా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 07603 నాందేడ్ - సీఎస్‌టీ ముంబై సోమవారాలలో బయలుదేరుతుంది. ఈనెల 22 నుంచి సెప్టెంబరు 29 వరకు రెండు సర్వీసులు నడుస్తుంది. 07604 నెంబరుతో ఇదే రైలు సీఎస్‌టీ ముంబై నుంచి మంగళవారం బయలుదేరుతుంది. ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు రెండు సర్వీసులు నడుస్తుంది. 07001 చర్లపల్లి - తిరుపతి బుధవారాలలో బయలుదేరుతుంది. అక్టోబరు 8 నుంచి నవంబరు 26వ తేదీ వరకు ఎనిమిది సర్వీసులు నడుస్తుంది. ఇదే రైలు 07002 నెంబరుతో తిరుపతిలో గురువారాలలో బయలుదేరుతుంది. అక్టోబరు 9 నుంచి నవంబరు 27 వరకు ఎనిమిది సర్వీసులు నడుస్తుంది. 07603, 07604 రైళ్లు పూర్ణా, పర్భనీ, మనవత్ రోడ్డు, సెలు, పర్టూర్, జల్నా, ఔరంగాబాద్, లసూర్, రొటేగాన్, నాగర్‌సోల్, మన్మాడ్, నాసిక్ రోడ్డు, ఇగతిపురి, కళ్యాణ్, థానే స్టేషన్‌లలో ఆగుతాయి. వన్ ఏసీ, టూ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అనుసంధానం అవుతాయి. 07001, 07002 రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, నెమలిపురి, రొంపిచర్ల, వినుకొండ, ధనకొండ, మార్కాపూర్ రోడ్డు, కంభం, గిద్దలూరు, నంద్యాల, కోయిలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతాయి. ఈ రైళ్లకు వన్ ఏసీ, టూ ఏసీ, త్రీఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్‌లు అనుసంధానం అయి ఉంటాయి.

చర్లపల్లి - తిరుపతి రద్దు

07013 చర్లపల్లి - తిరుపతి, 07014 తిరుపతి - చర్లపల్లి రైళ్లను ఇంతకుముందు ఎనిమిది సర్వీసులు చొప్పున నడుస్తాయని ఈనెల 1వ తేదీన దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అయితే ఇప్పుడు ఈ రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

పట్టని పనులు!

(5వ పేజీ తరువాయి)

14 తాగునీటి పైపులైన్ల పనులే మంజూరయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల మండలం పరిధిలో 9 పనులు, విజయవాడ రూరల్ మండలం పరిధిలో 5 పనులు మాత్రమే మంజూరయ్యాయి. వీటికి టెండర్లు పిలిచారు. అగ్రిమెంట్ల దశలో ఉన్నాయి. విజయవాడ రూరల్ మండల పరిధిలో టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు పనులకు ఆసక్తి చూపిస్తారా? వదిలేస్తారా అనే అనుమానాలు కూడా ఉన్నాయి.

తమది కాదన్నట్టు వ్యవహరించారు!

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కార్యాలయం నుంచి ఈ మేరకు ప్రతిపాదనలు చేయాల్సి ఉంది. రెండు జిల్లాల్లోని ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రాధాన్యతా పనుల జాబితా తెప్పించుకుని వాటి సాకారానికి కృషి చేయాల్సిన ఉన్నతాధికారులు తమది కాదన్నట్టుగా వ్యవహరించారని విమర్శలు వస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న కొందరు ఉన్నతాధికారులు ఇక్కడ బలవంతంగా పనిచేస్తున్నారని సమాచారం. ఎప్పుడు వెళ్లిపోదామా అన్న ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఇలాంటి ఆలోచనలతో ఉన్నవారు జిల్లాలో ఈ పనులపై ఎంత వరకు శ్రద్ధ చూపుతారన్నది అర్థం చేసుకోవచ్చు. చెంచులు నివశించే ప్రాంతాలు లేకపోతే ఈ 14 పనులు కూడా మనకు వచ్చేవి కావని తెలిసింది.

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు విషయంలోనూ తాత్సారం

ఉమ్మడి కృష్ణాజిల్లాకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి జల్ జీవన్ మిషన్ కింద రూ.6,063 కోట్ల వ్యయంతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు ఆర్‌డబ్ల్యూఎస్ నేతృత్వంలో డీపీఆర్ తయారు చేశారు. పాత పనులను పూర్తిగా వదిలేసి.. కొత్త పనులపై దృష్టి సారించారు. 50 మండలాల పరిధిలో నూరుశాతం రక్షిత నీటిని అందించాలన్న ఉద్దేశ్యంతో సమగ్ర డీపీఆర్‌ను తయారు చేశారు. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో కలిసిన ప్రాంతాలను కూడా ఉమ్మడి కృష్ణా డీపీఆర్‌లో చేర్చటం జరిగింది. ఈ డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించటం లోనూ అంతులేని జాప్యం జరిగింది. ప్రభుత్వం నుంచి తెచ్చుకునే విషయంలో కూడా జాప్యం జరుగుతూ వస్తోంది. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా పులిచింతల నుం చి జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలకు మంచినీటిని ఒడిసి పట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రకాశం బ్యారేజీ బ్యాక్ వాటర్ ద్వారా గొల్లపూడి నుంచి తిరువూరు నియోజకవర్గంలో మూ డు మండలాలు, మైలవరం నియోజకవర్గం పరిధిలో విజ యవాడ రూరల్ మండలానికి కృష్ణా నీటిని తీసుకువెళ్లేలా నిర్ణయించారు. వీటీపీఎస్ కూలింగ్ కెనాల్ ద్వారా ఇప్పటికే మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం మం డలాలకు పాక్షికంగా మంచినీటి అవసరాలను తీర్చటం జరుగుతోంది. తాజా వాటర్‌గ్రిడ్ డీపీఆర్‌లో ఆయా మండలాలకు పూర్తి స్థాయిలో మంచినీటిని అందించేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తిరువూరు నియో జకవర్గం పరిధిలోని ఏ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలకు కూడా సంపూర్ణంగా కృష్ణా జలా లను తీసుకు వెళ్లేందుకు వీలుగా ప్రతిపాదనలు చేశారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం ఆమో దించాల్సి ఉంది. ఆ తర్వాత వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తన ఆర్థిక పరిస్థితులను బట్టి మొదటి దశలో ప్రాధాన్యతా క్రమంలో ఎంత వరకు శాంక్షన్ ఇస్తుం దన్నదానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. వా టర్ గ్రిడ్ ప్రాజెక్టు పేరుతో ఇప్పటికే నోటిఫైడ్ అయి, టెం డర్లు పిలిచిన పనులలో ప్రాధాన్యత కలిగిన వాటిపై నిర్లక్ష్యం చూపటం వల్ల క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అభివృద్ధికి బాట

(5వ పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.574 కోట్లతో ఆమోదం తెలిపింది. ఎస్ఎన్ గొల్లపాలెం సమీపంలో 216 జాతీయ రహదారి, 65 జాతీయ రహదారులు కలిసే ఫ్లైఓవర్ వద్ద క్రాస్ క్లోవర్ లీఫ్ నమూనాలో ఆధునాతన పద్ధతిలో రహదారి నిర్మాణానికి రూపకల్పన చేశారు. ఇందుకోసం ఎస్ఎన్ గొల్లపాలెం వద్ద 38 ఎకరాలు, అరిసేపల్లి పంచాయతీ పరిధిలో 11 ఎకరాలు, మాచవరం సమీపంలో ఐదు ఎకరాల భూమి, అదనంగా మరో రెండు ఎకరాల భూమి మొత్తంగా 58 ఎకరాలు అవసరమవుతుందని మోర్త్ అధికారులు గుర్తించారు. పంట కాలువలు, డ్రైనేజీలు ఉన్న చోట కల్వర్టులు, వంతెనలు, రోడ్డు క్రాసింగ్ వద్ద అండర్ పాస్‌ల నిర్మాణాలకు కూడా ప్రతిపాదనలు రూపొందించారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి, 216 జాతీయ రహదారి కలిసే ప్రాంతం నుంచి పెడన సమీపంలోని హర్ష కాలేజీ వరక ఆరులేన్లుగా అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి ప్రతిపాదనలకు ఆమోదం లభించడంతో భూసేకరణకు రెవెన్యూ అధికారులు రంగం సిద్ధం చేశారు. కలెక్టర్ బాలాజీ అనుమతులతో జేసీ గీతాంజలి శర్మ భూసేకరణకు సంబంధించిన ఫైలుపై ఇటీవల సంతకాలు చేశారు. వారం, పది రోజుల్లో భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల అవుతుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎస్ఎన్ గొల్లపాలెం పరిధిలో జాతీయ రహదారి పక్కన ఎకరం భూమి రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.85 లక్షల మేర విలువగా ఉంది. రహదారి అభివృద్ధి కోసం భూమిని తీసుకుంటే ప్రస్తుతం ఉన్న భూమి రేటును బట్టి రెండున్నర రెట్లు అధికంగా చెల్లించి భూసేకరణ చేసేందుకు అవకాశం ఉందని రెవెన్యూ అధికారుల మాటగా ఉంది. అయితే జాతీయ రహదారి పక్కనే ఉన్న భూమి గజం స్థలం రూ.80 వేల నుంచి లక్ష రూపాయల్లోపు బహిరంగ మార్కెట్‌లో పలుకుతోంది. దీంతో రైతులు భూములను ఇచ్చేందుకు ఎంతమేర ముందుకు వస్తారనే అంశంపై సందిగ్ధత నెలకొంది. జాతీయ రహదారుల విస్తరణకు భూమి తీసుకునేందుకు నోటిఫికేషన్ ఇచ్చి, అవార్డ్ పాస్ చేసి తర్వాత రైతులకు నగదు చెల్లింపులు ఉంటాయని, నగదు చెల్లింపులలో ఆలస్యమైతే 12 శాతం వడ్డీతో సహా చెల్లింపులకు అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు.

ఉచిత టికెట్ల రగడ!

(5వ పేజీ తరువాయి)

సౌకర్యాలపై ఆయా శాఖలు దృష్టి సారించి దేవస్థానానికి సలహాలు ఇవ్వాలి కానీ, టికెట్ల వంటి దేవస్థాన అంతరంగిక విషయాలను కూడా సమన్వయ శాఖలు ప్రభా వితం చేసేలా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. గత దసరా ఉత్సవాల్లో వీఐపీ దర్శనాల ప్రభావంతో రూ.500 టికెట్ కొనుక్కుని క్యూలో వెళ్లిన వారికి చుక్కలు కనిపించాయి. వీఐపీ దర్శనాలను క్రమబద్ధీకరించాలని ఒక నిర్దిత సమయంలో పంపాలని భావించి.. సమన్వయ శాఖలకు, వారు చెప్పిన వారికి ఉచితంగా టికెట్లను ఇచ్చారు. అయితే వీఐపీలు వారికి నిర్ణయించిన సమయాలలో రాలేదు. దీంతో వీఐపీలను క్రమబద్ధీకరించే విధానమన్నది విఫలమైంది.

వీఐపీ దర్శనాలు, అనధికారిక వీఐపీ దర్శనాలను నియంత్రించలేకపోయా రు. ఇప్పుడైనా వాటిని కట్టడి చేసే అంశంపై దృష్టి సారించకుండా ఈ ఏడాది ఏకంగా రూ.500 టికెట్లు రద్దు చేశారు. ఈ కారణంగా దేవస్థానానికి మరో రూ.2 కోట్ల మేర ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది.

వీఐపీలను క్రమబద్ధీకరించటం చేతకాక రూ.500 టికె ట్లు కొనుగోలు చేసే భక్తులను నియంత్రిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సమన్వయ శాఖలు సమస్యలను పరిష్కరిస్తున్నాయా లేక సమస్యలను సృష్టిస్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

తరకటూరు వద్ద రోడ్డు ప్రమాదం

ఇద్దరు యువకుల మృతి

● విజయవాడ నుంచి బీచ్‌కు వెళ్తుండగా ఘటన



మృతులు ఆదాంబాబు, షారిన్


మోపెడ్ ఢీకొట్టిన ట్రాక్టర్

గూడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై గూడూరు మండలం తరకటూరు వద్ద శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరొక యువకుడు గాయపడ్డాడు. విజయవాడలోని పోరంకికి చెందిన పరిమి ఆదామ్‌బాబు (19), పెనమలూరుకు చెందిన కొమ్మవరపు షారిన్ (19), తాడిగడపకు చెందిన కోట కౌషిక్ మోపెడ్‌పై మంగినపూడి బీచ్‌కు వెళ్తూ ఎదురుగా ఇటుక రాళ్ల లోడ్ ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయింది. జోరున వర్షం కురుస్తుండటంతో ముందు ట్రాక్టర్ కనబడక ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఆదాంబాబు తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. షారిన్‌కు బలమైన గాయాలు కాగా కొన ఊపిరితో ఉన్న అతన్ని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కౌషిక్ స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై కె.ఎన్.వి. సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కప్తానుపాలెం వద్ద రోడ్డు ప్రమాదం

● పాస్టర్ దుర్మరణం


మృతుడు జకరయ్య

మోపిదేవి : కప్తానుపాలెం వద్ద జాతీయ రహదారిపై కారును బైక్ ఢీకొన్న సంఘటనలో పాస్టర్ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. కొల్లూరు మండలం జువ్వలపాలెంకు చెందిన దైవసేవకులు జకరయ్య (50) (పాస్టర్) చల్లపల్లిలో వచ్చి పని ముగించుకుని తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కప్తానుపాలెం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న మనిషిని తప్పించబోయి కారును ఢీకొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో జకరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మోపిదేవి ఎస్సై సత్యనారాయణ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పోర్టు పనుల పురోగతిని తెలుసుకుంటున్న రవాణా, ఆర్ అండ్ బి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ.కృష్ణబాబు

వచ్చే ఏడాది అక్టోబరుకు పోర్టు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

సమీపంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర అవసరాలు కూడా తీరుతాయన్నారు. ప్రణాళికలో భాగంగా మొత్తం 16 బెర్తులను ఏర్పాటుచేస్తున్నామనీ, మెదటి దశగా నాలుగు బెర్తులను అనుకున్న సమయానికి పూర్తిచేసి కార్యకలాపాలను ప్రారంభిస్తామనీ, మిగిలిన బెర్తుల నిర్మాణ పనులను కొనసాగిస్తామన్నారు. ప్రస్తుతం 50 శాతం పనులు పూర్తయినట్లు చెప్పారు. త్వరలో అమరావతి ఔటర్‌రింగ్ రోడ్డు ఏర్పాటు కానున్న నేపథ్యంలో హైదరాబాద్ మార్గంతోపాటు పోర్టుకు సమీపంలోని జాతీయ రహదారులు, రైలు రవాణా మార్గాలను అభివృద్ధి చేస్తామని, అందుకు సంబంధించిన డీపీఆర్‌లను ఇప్పటికే సిద్ధంచేసినట్లు తెలిపారు.

పనుల్లో పురోగతి లేకుంటే కాంట్రాక్టు రద్దు

గిలకలదిండి హార్బర్ పనుల్లో పురోగతి కనిపించకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని రాష్ట్ర రవాణా, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు హెచ్చరించారు. గిలకలదిండిలో రూపుదిద్దుకుంటున్న ఫిషింగ్ హార్బర్‌ను శనివారం ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. హార్బర్ నిర్మాణ ప్రణాళిక, డ్రెడ్జింగ్, బ్రేక్ వాటర్, భవన నిర్మాణాలు, టెట్రాపాడ్స్ దిమ్మల ఏర్పాటు తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆశించినరీతిలో పనులు ముందుకు సాగటంలేదన్నారు. పురోగతి మందగించిందని పేర్కొన్నారు. పనులను వేగవంతం చేసి నిర్దేశించిన సమయానికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. లేనిపక్షంలో కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, జాయింట్ సీఎఫ్‌వో సతీష్, ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ టీం లీడర్ చేతన్, ఏపీ మారిటైం బోర్డు సీఈ రాఘవరావు, రైట్స్ సంస్థ ప్రతినిధి విశ్వనాథం, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్, ప్రజారవాణా అధికారి వెంకటేశ్వరులు, మచిలీపట్నం ఉత్తర, దక్షిణ మండలం తహసీల్దార్లు నాగభూషణం, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

గాయత్రీ మందిరం కమిటీ అధ్యక్షుడిగా కేవీఆర్ కిషోర్

గన్నవరం(ఉంగుటూరు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గన్నవరంలోని గాయత్రీ మందిరం నిర్వహణ కమిటీ అధ్యక్షులుగా పట్టణానికి చెందిన ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ కేవీఆర్ కిషోర్ నియమితులయ్యారు. శనివారం మందిర నిర్వహణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నాదెళ్ల మోహన్, విష్ణుమూర్తి, కడియాల రవి, కంభంపాటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. కార్యదర్శిగా ఎస్వీ గోపాలకృష్ణ, కోశాధికారిగా జీవీ హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.రవికుమార్, కే.శివరామకృష్ణ, వెన్నూతల సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా శ్రీకాంత్‌శర్మ, సీహెచ్ బాలభాస్కరశర్మ, న్యాయసలహాదారుగా జీఎస్ఆర్ మూర్తి, గౌరవ సలహాదారులుగా ఎస్.వెంకటేశ్వరశర్మ, జి.గోపాలకృష్ణశర్మ, పీఆర్వోలుగా కే.శ్రీవత్స, వీవీ కృష్ణమోహన్, సభ్యులుగా రాధాకుమారి, శ్రీపాద మరో తొమ్మిది మందితో కమిటీ ఏర్పడింది.

దుర్గగుడి అన్నవితరణకు విరాళం



దాత కొమ్మినేని దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారి

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం లో అన్నదాన పథకానికి శనివారం విజయవాడ పోరంకి కృష్ణవేణి నగర్‌కు చెందిన కొమ్మినేని ప్రతాప్‌కుమార్ దంపతులు రూ.1,00,000లు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మ వారి సన్నిధికి తోడ్కొని వెళ్లి దర్శనం కల్పించారు. వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అధికారులు దాత కుటుంబానికి అమ్మవారి చిత్రపటం విరాళం రశీదు, లడ్డుప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



పోరంకి టీడీపీ కార్యాలయంలో ఎల్వోసీ చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

సీఎం సహాయనిధి పేదలకు వరం

పెనమలూరు, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు సీఎం సహాయనిధి ఒకవరం లాంటిదని టీడీపీ నేత బోడె సురేష్ పేర్కొన్నారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీ పత్రాలను పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులు శీలం అజయ్, నిమ్మకూరు ఆనంద్‌బాబు, సుంకర పద్మజలకు రూ. లక్షల విలువైన ఎల్వోసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బోడె సురేష్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఇప్పటివరకు 876మందికి 8.09కోట్ల రూపాయల ఎల్వోసీ పత్రాలను పంపిణీ చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, తోటకూర సుబ్బారావు, బొంగరాల అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.



వెలగపూడి త్రిపురాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

కానూరులో వెలగపూడి త్రిపురాంబ వర్ధంతి

కానూరు, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): కానూరులోని అశోక్‌నగర్‌లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు తల్లి వెలగపూడి త్రిపురాంబ 11వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు త్రిపురాంబ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, సాంబశివరావు, శ్రీరాంప్రసాద్, శివరాంప్రసాద్, గద్దం సత్యనారాయణ, ఉషారాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దళిత రణభేరి విజయవంతం చేయండి

కంకిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 24న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న దళిత రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుడె జయప్రకాష్ అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడె జయప్రకాష్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు పేట్రేగి పోతున్నాయన్నారు. దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 24న విజయవాడ ధర్నా చౌక్ వద్ద చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ముజీబ్, మట్టిపల్లి లూసిపాల్, తాటితోటి నరసింహారావు, గుమ్మడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి

బెస్ట్ టీచర్స్ డే కార్యక్రమంలో రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రమేష్‌బాబు

కానూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థులను ఆకర్షించే విధంగా విద్యాబోధన చేయాలని రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(నెల్లూరు) ప్రొఫెసర్ బి. రమేష్‌బాబు అన్నారు. కానూరులోని వైవీ రావు సిద్ధార్థ బీఈడీ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ ఎంఈడీస్ ప్రోస్పెరిటీ అసోసియేషన్(ఏపీఎంపీఏ) ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్స్ డే-2025 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ , ఆచరణలో గురువు స్థానం పదిలంగా ఉండాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథి ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (విజయవాడ) రీజినల్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి. ప్రసాద్‌బాబు ప్రసంగిస్తూ బెస్ట్ అవార్డు ఉపాధ్యాయుల బాధ్యతను పెంచుతుందన్నారు. మరో గౌరవ అతిథి ప్రొఫెసర్ ఎం. రవికుమార్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు సబ్జెక్టుపై పట్టుతోపాటు ప్రేరణ ఉండాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి. రమేష్ మాట్లాడుతూ, ఎంఎడ్‌తోపాటు ఉన్నత విద్యను అభ్యసించిన విద్యా వేత్తలకు ప్రభుత్వం సరైన స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శేషశ్రీ, సొసైటీ సభ్యులు మూర్తి, శ్యామ్‌బాబు, వీరలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 మంది ఉత్తమంగా నిలిసిన ఉపాధ్యాయులను సత్కరించారు.



బెస్ట్ టీచర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రాజీయే రాజమార్గం

ఉయ్యూరు న్యాయాధికారి కె. శ్రీహరి

ఉయ్యూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజీయే రాజమార్గం అని ఉయ్యూరు న్యాయాధికారి న్యాయమూర్తి కె.శ్రీహరి అన్నారు. శనివారం ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 282 కేసులు పరిష్కరించి రూ. 9,75,130 అపరాధ రుసుంగా కక్షిదారులు ఇప్పించారు. పరిష్కరించిన వాటిలో ఎస్టీసీ 200, సీసీఎస్ఐ యాక్ట్ 5, సీసీ ఎక్సైజ్ 39, ఐపీసీ 12, ఐపీసీ అడ్మిషన్ 14, ఓఎస్ 2 కేసులు ఉన్నాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, సీనియర్ న్యాయవాది చంటిబాబు, ప్రసాద్, సంగం తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

125 కేసులు పరిష్కారం

హనుమాన్‌జంక్షన్ : నూజివీడు ఏజెఎఫ్‌సీఎం కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో జంక్షన్ పీఎస్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 125 కేసులను పరిష్కరించినట్లు ఎస్సై వి.సురేష్ తెలిపారు. ఇందులో బీఎన్ఎస్ కింద నమోదైన 32 కేసులుతో పాటు 93 పెట్టీ కేసులు కూడా పరిష్కారమయినట్లు తెలిపారు.



మాక్ టెస్ట్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆలిండియా బార్ ఎగ్జామినేషన్

మాక్ టెస్ట్‌కు 273 మంది హాజరు

కానూరు, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా న్యాయశాస్త్ర పట్టా పొంది న్యాయవాది వృత్తిలోకి అడుగుపెట్టే విద్యార్థుల కోసం కానూరులోని సిద్ధార్థ లా కళాశాలలో శనివారం జరిగిన ఏఐబీఈ(ఆలిండియా బార్ ఎగ్జామినేషన్) మాక్ టెస్ట్‌కు 273 మంది విద్యార్థులు హాజరయ్యారు. సిద్ధార్థ లా కళాశాల, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈటెస్ట్ జరిగింది. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది చలసాని అజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్‌బాబులు హాజరై మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని వారికి చేయూత నిచ్చే విధంగా ఎటువంటి నమోదు రుసుం లేకుండా నిపుణుల ఆధ్వర్యంలో ఈటెస్ట్ నిర్వహించామన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి

పేదలకు దుస్తుల పంపిణీ

ఉయ్యూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో గురజాడ డొంక చెరువుకట్ట వాసులకు క్లబ్ అధ్యక్షురాలు నర్రా సుధారాణి శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకుని జీవనం సాగిస్తున్న ఎస్టీ కుటుంబాలు, వారి పిల్లలకు తోచిన విధంగా సాయం చేయాలన్న ఉద్దేశంతో 30 మందికి దుస్తులు, అల్పాహారం అందజేశామన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

గన్నవరం(ఉంగుటూరు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం రవీంద్రభారతి పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పిల్లలతో తమకున్న అనుబంధాలు, అనుభూతులను పంచుకున్నారు. వివిధరకాలైన ఆటల పోటీల్లో కూడా గ్రాండ్ పేరెంట్స్ ఎంతో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పిల్లలందరూ తమ గ్రాండ్ పేరెంట్స్ కాళ్లకు నమస్కరించి వారి ఆశీస్సులు పొందారు. హెచ్‌ఎం సుష్మా మాట్లాడుతూ, విద్యార్థుల జీవితంలో గ్రాండ్ పేరెంట్స్ ప్రధాన భూమిక పోషిస్తారన్నారు. ఏవోలు ఎస్.వంశీధర్, ఎ.హసీన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మానవత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘనసన్మానం

గన్నవరం(ఉంగుటూరు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తుకు మూలస్తంభాలుగా నిలుస్తూ, సమాజ ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులను సముచితరీతిని సత్కరించుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందని మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి అన్నారు. గురు పూజోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని గన్నవరం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న నియోజకవర్గంలోని పదిమంది ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సత్కరించారు. గన్నవరంలోని విశ్వభారతి నవోదయ, సైనిక్ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొల్లి సత్య జగదీశ్వరరావు, జీవీ రవిబాబు, డి.రాజరాజేశ్వరి, డి.రాజారత్నం, డి.కుమార్, డి.జ్ఞానేష్, కేవీ పద్మావతి, ఆర్.రత్నకుమారి టి.సుబ్బలక్ష్మి, సి.రాధలను సంస్థ ప్రతినిధులు శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. సంస్థ కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, విద్యావిభాగం డైరెక్టర్ సయ్యద్‌లాల్, కోశాధికారి పొట్లూరి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పువ్వుల ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి వి.వెంకటేశ్వరరావు, ఆర్థిక విశ్లేషకులు జి.వెంకట్రావు, లక్నో ఎయిర్పోర్ట్ మాజీ డైరెక్టర్ ముక్కామల సుబ్బారావు, ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీవీ కృష్ణమోహన్ విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధార్థ వర్సిటీలో స్వచ్ఛతా పక్వాడా వేడుకలు

కానూరు, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ ఆవరణలో శుభ్రత కార్యక్రమం నిర్వహించి సిబ్బందికి విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. వాలంటీర్లు చెత్తను తొలగించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. శివరాంప్రసాద్‌తోపాటు వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి నీట మునిగిన ప్రధాన రహదారులు

కంకిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని వివిధ గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి పలు ప్రధాన రహ దారులు, పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. కంకిపాడు బస్టాండ్ చెరువును తలపిం చింది. ప్రయాణికులు బస్టాండ్ లోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా బందరు రోడ్డు మొత్తం నీట మునిగి వాహనదారుల రాకపోకలకు ఆటంకం రోడ్డుకు ఇరువైపులా నీరు నిలిచి పాదచారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. అదే విధంగా గోసాల - వణుకూరు - మద్దూరు ప్రధాన రహదారిపై నీరు నిలిచి రోడ్లు చెరువును తలపిస్తున్నాయి.



కంకిపాడులో నీటమునిగిన రోడ్డు

దసరా ఏర్పాట్లపై దిశానిర్దేశం

● సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలి ● తనిఖీల్లో అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



దసరా ఏర్పాట్లపై దేవాలయ, పోలీసు అధికారులతో చర్చిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని ఎన్టీఆర్ జిల్లా జి.లక్ష్మీశ అన్నారు. ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం అధికారులతో కలిసి శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే మార్గాల విషయంలో ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఏమాత్రం అసౌకర్యం కలిగినా, అలసత్వం కనిపించినా ఇంజనీరింగ్ అధికారులదే బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఈనెల 22వ తేదీన ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో రాజీ పడవద్దన్నారు. భక్తులకు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు, ప్రసాదాల తయారీ, రక్షితనీరు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలు పరిశీలించారు. మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో భక్తులకు అవసరమైన స్నానఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవడంతో పాటు నిరంతరం పర్యవేక్షించి పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం...

దుర్గగుడి అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనకదుర్గానగర్ ప్రారంభంలో ఉన్న షాపును వెంటనే తొలగించాలని పలుమార్లు దసరా ఏర్పాట్లు పరిశీలనకు వచ్చిన సమయంలో ఆదేశించినా ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. స్పందించిన అధికారులు తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు తరలివచ్చారు. కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. క్యూలైన్లలో అనుసరించాల్సిన విధివిధానాల పై సిబ్బందికి ఈవో పలు సూచనలు చేశారు.



దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్‌లో వేచియున్న భక్తులు

దసరా ఉత్సవాల్లో పరోక్ష ఆర్జిత సేవల రుసుం ఇలా..

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో 22నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల సందర్భంగా పరోక్షంగా ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు చెల్లించాల్సిన రుసుముల వివరాలను ఈవో శీనానాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్చువల్ సేవ - ఆన్‌లైన్ వెబ్‌లింక్ ద్వారా పరోక్షంగా వీక్షించవచ్చు. ఈ విధంగా వీక్షించేందుకు తగిన రుసుములు భక్తులు చెల్లించాల్సి ఉంటుంది. పరోక్ష ప్రత్యేక ఖడ్గమాలార్చనకు రూ.1500, ప్రత్యేక కుంకుమార్చనకు రూ.1500, శ్రీచక్ర నవావరణార్చనకు రూ.1500, చండీహోమానికి రూ.1500 చొప్పున ఒకసారికి చెల్లించవలసి ఉంటుంది. పది రోజులకుగాను రూ.11,116 చెల్లించాలి. ఆలయ నియమాల మేరకు ప్రసాదాలను పోస్టు ద్వారా చిరునామాకు పంపుతామన్నారు.

మూడు రోజుల్లో పనులు పూర్తి చేయండి

ఆయా విభాగాలకు ఈవో శీనానాయక్ ఆదేశాలు

వన్‌టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో 22నుంచి జరగనున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని జరుగుతున్న ఏర్పాట్లను మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఈవో శీనానాయక్ ఆయా విభాగాల అధికారులను ఆదేశిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యటనలో చేసిన కొన్ని సూచనలు మేరకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లు, ఘాట్లు, టాయిలెట్లు, క్లోక్‌రూమ్, అన్నదానం బిల్డింగ్, లడ్డూ పోటు, గోశాల, డోనర్ లాంజ్‌లలో శానిటేషన్ విభాగం ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలని ఆదేశించారు. టాయిలెట్ల మరమ్మతులుంటే తక్షణం పూర్తి చేయాలన్నారు. గోశాల వద్ద నిలిచిపోయిన నీటిని తక్షణమే తొలగించాలన్నారు. టోల్ గేట్ నుంచి కొండపై వరకు వేసిన క్యూలు, సీతమ్మవారి పాదాలు, కేశఖండనశాల, ఓం టర్నింగ్, భవానీఘాట్, దోబీ ఘాట్, చిన్నరాజగోపురం క్యూలైన్లను పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ఘాట్‌ల వద్ద నీటి సరఫరా నిరతంరంగా ఉండాలన్నారు. స్త్రీలు దుస్తులు మార్చుకోవటానికి అదనపు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ విషయంలో చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. ప్రథమ చికిత్స ఏర్పాట్లతోపాటు ఓఆర్ఎస్ వంటి వాటిని మెడికల్ క్యాంపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. సీతమ్మవారి పాదాలు, ఓం టర్నింగ్ సర్వీసు లైన్, స్కానింగ్ కౌంటర్లు, సీసీ టీవీ కెమెరాలు, ఎల్ఈడీ స్క్రీన్స్, మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, తదితరాల దగ్గర మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. మల్లేశ్వరాలయం మెట్లు, రాయభారం మండపం ఎగ్జిట్ పాయింట్ వద్ద, మహామండపం, అండర్‌పాస్ ఉచిత బస్టాప్ వద్ద, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఆలయం లోపల హుండీలు, తదితర ప్రాంతాల్లో మరమ్మతులు చేయాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న షెడ్లను వెంటనే కూల్చివేయాలన్నారు. కుమ్మరిపాలెం సెంటర్ (టీటీడీ సైట్), రైల్వే గ్రౌండ్, పూల మార్కెట్ ప్రాంగణం, విఎంసీ ఆఫీసు వెనుకాల, భవానీఘాట్, బబ్బూరి గ్రౌండ్స్ వద్ద లెవల్ చేసి బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. పున్నమీఘాట్ వద్ద విజయవాడ ఉత్సవాలు నిర్వహిస్తున్న కారణంగా అక్కడ పార్కింగ్‌కు కేటాయించకుండా బబ్బూరి గ్రౌండ్స్, భవానీఘాట్, వీఎంసీ కల్యాణ మండపం, తదితరాలను పార్కింగ్‌కు వినియోగించుకోవాలన్నారు. క్యూలలో ప్రతి వంద మీటర్లకు క్యూఆర్‌కోడ్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అన్నదానం, లడ్డూ పోటు, క్లోక్ రూమ్, నిష్క్రమణ మార్గాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం కలిగేలా అమ్మవారి చిత్రాలు, అష్టోత్తరాలు, శ్లోకాలు తదితర బొమ్మలతో క్యూలైన్లలో ఏర్పాటు చేయాలని ఈవో సూచించారు.



ముగిసిన సైన్స్ ఎగ్జిబిషన్

ఆకట్టుకున్న ప్రాజెక్టులు

విజయవాడ: పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఆర్‌జీకర్, సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం ముగిసింది. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలు సందర్శకులకు ఆకర్షించాయి. విద్యార్థులు వారు తయారు చేసిన ప్రాజెక్టులను కళ్లకు కట్టినట్టు వివరించారు. సిద్ధార్థ కళాశాల 50వ వార్షికోత్సవం సందర్భంగా ఐజీసీఏఆర్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ ఇటువంటి ఎగ్జిబిషన్‌ల వల్ల విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తితోపాటు మేథో శక్తికి దోహదపడుతుందన్నారు.

ఆకట్టుకున్న ప్రాజెక్టులు

ప్లూటోనియం, యురేనియంతో విద్యుత్ తయారుచేసే ఫాస్ట్ బ్రీటా రియాక్టర్. నేచురల్ బ్యాగ్రౌండ్ రేడియేషన్ అనే వైద్య పరికరం. ప్రజలు ఏదోవిధంగా రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యానికి గురవుతున్నారో తెలిపారు. బాబాట్రామ్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

సెల్.. చెల్తా





ఇంద్రకీలాద్రిపై సెల్ ఫోన్ నిషేధం.. కానీ కొందరు భక్తులు యథేచ్ఛగా వాటిని గుడి ఆవరణలోకి తీసుకొచ్చి వినియోగిస్తున్నారు. దీనిపై సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నిస్తే.. వీఐపీ పేర్లు చెప్పి వారి తాలూకా, ప్రొటోకాల్ సిబ్బంది తాలూకా, అధికారుల పేర్లు చెప్పటంతో సెక్యూరిటీ కూడా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలున్నాయి.







సమావేశంలో మాట్లాడుతున్న శివస్వామి

ధర్మ సమ్మేళనం నేడు

గొల్లపూడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పీఠాధిపతుల నిర్దేశకత్వంలో రాష్ట్ర స్థాయి హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు తాళ్లాయపాలెం స్వామీజీ శివస్వామి తెలిపారు. శనివారం గొల్లపూడిలోని పద్మావతి కల్యాణ మండపంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వామి, ఆత్మానంద భారతి స్వామీజీ మాట్లాడుతూ ఆదివారం జరిగే కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వందలాది న్యాయవాదులు హాజరై ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణ, పీఠాల, ఆశ్రమాల, అన్నసత్రాల సంరక్షణ, పూజ్య స్వామీజీలు, హిందూ సంఘాలు, హిందూ కార్యకర్తలపై అక్రమ కేసులు, వేధింపుల గురించి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. నివారణ చర్యలపై చర్చ జరుగుతుందన్నారు. కార్యాచరణ గురించి ఆలోచన చేయనున్నట్లు తెలిపారు. హిందూ న్యాయవాదులు కోటు ధరించి విశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా, నిర్వాహకుడు కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ వ్యవహారంలో మహిళపై దాడి

మనస్తాపంతో ఫ్యానుకు ఉరి : చికిత్స పొందుతూ మృతి

గుణదల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రేమికులు పెద్దలను ఒప్పించుకుని పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ప్రియురాలి ఇంటికి వెళ్లి విషయం చెప్పాడు. క్షణాల వ్యవధిలోనే ప్రియురాలి బంధువులు దాడికి తెగబడ్డారు. దాడి సమయంలో ప్రియుడి తల్లికి తీవ్ర అవమానం జరిగేలా ప్రవర్తించటంతో తట్టుకోలేక ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుంది. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. గిరిపురంలో పల్లెపోగు కుమార్ బాబు, కుమారి పెద్దకుమారుడు గోపీచంద్ గిరిపురానికి చెందిన యువతితో కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 11న గోపీచంద్ ప్రియురాలి ఇంటికి వెళ్లికి నేరుగా ఆమె తండ్రి రాజశేఖర్‌తో చెప్పాడు. దానికి అతను అంగీకరించలేదు. రాత్రి బిషప్ అజరయ్య స్కూల్ సెంటర్ వద్ద రాజశేఖర్, అతని బావమరిదితో కలిసి గోపీచంద్‌తో వాగ్వాదానికి దిగారు. యువతి మేనమామ మరో ఇరువురు ఇజ్రాలతో కలిసి గోపీచంద్ ఇంటికి వెళ్లి దాడికి తెగబడ్డారు. ఆ సమయంలో గోపీచంద్ తల్లి కుమారిని తీవ్రంగా అవమానించటంతో మనస్తాపం చెంది ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుంది. అక్కడే ఉన్న వారు కుమారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతున్న కుమారి శనివారం మృతిచెందింది. మాచవరం పోలీసులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుమారి భర్త పల్లెపోగు కుమార్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఇంటి స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

రాజకీయ రంగు పులుముకున్న ఇంటి వ్యవహారం

మోపిదేవి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలంక వద్ద ఈడే విజయకుమారి కుటుంబ సభ్యులకు చెందిన ఇంటి వివాదాన్ని కావాలని రాజకీయం చేస్తున్నారంటూ దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆరోపించారు. మోపిదేవి లంక గ్రామానికి చెందిన ఓ రైతు ఏ విధమైన ఆధారంలేని సమయంలో విజయకుమారి కుటుంబసభ్యులకు తన వ్యవసాయ భూమిలో ఇల్లు నిర్మించుకోమని ఆశ్రయంకల్పించారు. ప్రస్తుతం వ్యవసాయ పొలాన్ని మరొక వ్యక్తికి విక్రయించారు. దాంతో తన పొలంలో ఉన్న ఇంటిని తొలగించమన్నారు. రెండు నెలల క్రితం చెప్పి శుక్రవారం రాత్రి ఇంటిని తొలగించారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీలకు అంటించి వివాదం చేయటం ఏ మాత్రం తగదని వెంకటేశ్వరరావు అన్నారు.

రాజకీయంగానే తొలగించారు.. : వైసీపీ

40 సంవత్సరాలుగా ఈడే విజయకుమారి కుటుంబసభ్యులు నివాసముంటుండగా, రాత్రికి రాత్రే తొలగించటం వెనుక రాజకీయ కారణాలున్నాయని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆరోపించారు. శనివారం మోపిదేవిలంక విచ్చేసి ఇంటి పరిసరాలు పరిశీలించి విజయకుమారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కూటమి నాయకులు కావాలనే వైసీపీకి చెందిన విజయకుమారి ఇంటిని తొలగించారన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రమేష్‌బాబు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే డయేరియా

కలుషిత నీటి వల్లే అంటున్న జనం
అపరిశుభ్రతే కారణమంటున్న అధికారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: న్యూ రాజరాజేశ్వరి పేటలో అతిసారకు కలుషిత నీరే కారణమని స్థానికులు చెబుతున్నారు. పైప్‌లైన్ లీకులు వల్ల డ్రెయినేజీ నీరు కుళాయిలకు ద్వారా సరఫరా అవుతున్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆ నీటిని తాగటం వల్లే వందలాది మంది డయేరియా బారిన రక్షిత నీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు ప్రభుత్వ చర్యల నుంచి తప్పించుకునేందుకు కొత్తడ్రామాలకు తెరదీస్తున్నారని ఆరోపిస్తున్నారు.

న్యూఆర్ఆర్‌పేటలో 6,800 గృహాల్లో 19వేల మంది జనాభా ఉంటున్నారు. వీరికి 15 లక్షల లీటర్ల కెపాసిటీ ఉన్న రక్షితనీటి పథకం నుంచి 5,900 కుళాయిలకు కార్పొరేషన్ సరఫరా చేస్తోంది. ఈ నెల 9వతేదీ రాత్రి నుంచి అతిసార కేసులు బయటపడ్డాయి. శనివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు అధికారికంగా 273 కేసులు నమోదయినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రకటించారు. ఈ కేసుల సంఖ్య 500లకు పైబడి ఉంటుందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. చాలా మంది నగరంలోని ప్రవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

మురికి నీటి కారణంగానే..

10 రోజుల నుంచి కుళాయిలకు మురికి నీరు వస్తుంది. పాచి పట్టిన నీరు రావటం మునిసిపల్ అధికారులు అందరికీ తెలుసు. అయినా ఏ ఒక్క అధికారి ఎట్టించుకోలేదు. ఆ నీటినే వంట, తాగటం వల్ల డయేరియా ప్రబలిందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రక్షితనీటిని సరఫరా చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని స్థానిక మహిళ ఆవేదన వ్యక్తంచేసింది.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..

మా ఇంటి పక్కనే డ్రెయినేజీ, ఆ నీరు పైప్‌లైన్‌లో కలుస్తున్నాయి. అవే కుళాయిలకు వచ్చేవి. దీనిపై కార్పొరేషన్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానిక మహిళ తెలిపారు. కొందరు అధికారులు అపరిశుభ్రతతోపాటు ఫుడ్ పాయిజన్ వల్ల కూడా డయేరియా ప్రబలుతుందంటున్నారు.

ప్రభుత్వ వైఫల్యం : గిడుగు రుద్రరాజు

విజయవాడ: న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా విజృంభిస్తున్నా.. అధికార యంత్రాంగం పరీక్షల పేరుతో కాలయాపన చేస్తుండడం ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డయేరియాతో ప్రజలు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదన్నారు. డయేరియాను అదుపుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కలుషిత నీరే కారణమని స్థానికులు గగ్గోలు పెడుతున్నా, ముగ్గురు మృతితో పాటు వందలాది మంది ఆసుపత్రి పాలైనా అధికారులు పట్టనట్టు వ్యవహరించడం దారుణమన్నారు. వెంటనే వైద్యబృందాలను పెంచాలని రుద్రరాజు డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు సహాయంతోపాటు అందరికీ ఆహారం, వైద్యం, వైద్య ఖర్చులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.



డయేరియా చికిత్స కేంద్రంలోని రోగులు



కలుషిత నీరు చూపిస్తున్న మహిళ

మా ఇంట్లో అందరికీ జ్వరాలు..

ఈ ప్రాంతం డ్రెయినేజీలు శుభ్రం చేయరు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తరలించరు. దాంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇప్పుడు హడావిడిగా వచ్చి శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లుతున్నారు. ముందే చేసుంటే ఈ జబ్బులు వచ్చేవి కాదు. మా ఇంట్లో అందరికీ జ్వరాలు. డ్రెయినేజీల్లోని నీటిని కుళాయిలకు పంపి, ఆ నీటినే మాతో తాగించి జబ్బుల బారిన పడేశారు.

తీర్థాల అన్నపూర్ణ, స్థానికురాలు

రోజూ ఆసుపత్రికి తిరుగుతున్నాం..

తొలుత నా చిన్నకూతురికి డయేరియా వచ్చింది. ఆమెను ఆసుపత్రిలో చూపిస్తుండగానే పెద్ద కూతురు జ్వరం బారిన పడింది. ఆసుపత్రిలో బెడ్‌లు లేవన్నారు. ఉదయం, సాయంత్రం ఇలా ఒకరి తరువాత ఒకరు ఆసుపత్రికి తీసుకెళ్తున్నాను. ఇద్దరికీ ఇంకా నయం కాలేదు. కూలీ పనులకు చేసుకుని బతికే వాళ్లం. ఒక్క రోజు పని మానితే కుటుంబ గడవని బతుకులు మావి.

బత్తుల కొండమ్మ, స్థానికురాలు

కొనసాగుతున్న టిప్పర్, లారీ ఓనర్స్ ఆందోళన

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉచిత బూడిద లోడింగ్ కోసం డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ తలపెట్టిన ఆందోళన రోజు రోజుకు ఉధృత రూపం దాల్చుతోంది. జోరు వర్షంలోనూ శనివారం సొసైటీ నాయకులు, సభ్యులు నిరసన ప్రదర్శనను ఆపలేదు. ఉచిత బూడిద లోడింగ్ ఆపేసి 400 మంది స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌ను వాటి మీద ఆధారపడి జీవించే 1,000 కుటుంబాలను జెన్కో యాజమాన్యం స్వార్థ ప్రయోజనాల కోసం రోడ్డున పడేసిందని కర పత్రాలను ఇంటింటికీ తిరిగి పంచారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందించారు. అనంతరం సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కోయ వెంకట్రావ్, కొండిశెట్టి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ బూడిద ప్రభావిత ఏడు గ్రామాల ప్రజల నుంచి తమకు సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. ఇప్పటికైనా జెన్కో యాజమాన్యం కార్పొరేట్ సంస్థకు ఇచ్చిన బూటకపు కాంట్రాక్టును రద్దు చేసి స్థానిక వాహనాలకు బూడిదను ఎప్పటిలానే ఉచితంగా అందించాలన్నారు. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తే నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించారు.ఉద్యమానికి గ్రామ సర్పంచ్ బూక్యా కవిత, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పెదర్ల రవి, కూటమి నాయకులు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు.



గుంటుపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యమానికి మాజీ మంత్రి జోగి మద్దతు

టిప్పర్, లారీ ఓనర్స్‌కు తమ పార్టీ అండగా ఉంటుందని వైసీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీమంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలో తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఉద్యమం చేస్తున్న ప్రతి ఒక్కరికీ వైసీపీ అండగా ఉంటుందన్నారు.

బాలుర వసతిగృహంలో వంట మాస్టర్‌పై విద్యార్థుల దాడి

గన్నవరం(ఉంగుటూరు) సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలుర వసతిగృహంలోకి మద్యం తెచ్చుకున్న విద్యార్థులను మందలించిన వంట మనిషిపై విద్యార్థులు దాడిచేసి ఘటన గన్నవరం మండలం, గొల్లనపల్లి జడ్పీహైస్కూల్ బాలుర వసతి గృహంలో శనివారం జరిగింది. గొల్లనపల్లికి చెందిన కంచర్ల కాశిమ్మ బాలుర వసతిగృహంలో వంటి చేస్తుంటుంది. శనివారం సాయంత్రం కొందరు విద్యార్థులు మద్యం తెచ్చుకుని భవనంపై కూర్చుని తాగుతున్నారు. వంటమనిషి కాశిమ్మ అనుమానంతో డాబాపైకి వెళ్లి చూసి మందలించడంతోపాటు వార్డెన్‌కు చెబుతానని కిందకు వచ్చింది. ఆమెను అనుసరిస్తూ కిందకు దిగిన విద్యార్థులు కాశిమ్మపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. దెబ్బలు తాళలేక ఆమె అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో వారు వెళ్లిపోయారు. కొద్దిసేపటికి తేరుకున్న కాశిమ్మ ఫోన్‌ద్వారా తన కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వసతి గృహం వద్దకు చేరుకుని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స చేసి, విజయవాడ తీసుకువెళ్లారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు.



చికిత్స పొందుతున్న కాశిమ్మ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140 , 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

16న హుండీల్లో కానుకల లెక్కింపు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 9 గంటలకు హుండీలను తెరిచి కానుకలను లెక్కిస్తామని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

గుడివాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న భవనంపై నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టూ టౌన్ పోలీసులు శనివారం దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుంచి రూ.6,540 స్వాధీనం చేసుకున్నామని సీఐ జె.ఆర్.కె.హనీష్ తెలిపారు.

మంత్రి నారా లోకేశ్ చొరవతోనే నేపాల్ నుంచి తెలుగువారు రాష్ట్రానికొచ్చారు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ చూపిన చొరవతోనే నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న తెలుగువారు సురక్షితంగా రాష్ట్రానికి వచ్చారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. చంద్రబాబు విజన్, ఎన్టీఆర్‌లోని పట్టుదల కలగలిసిన నేత లోకేశ్ అని ఆయన కొనియాడారు. శనివారం ప్రజావేదికలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రత్యేక వార్‌రూమును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రత్యేక విమానాల్లో తెలుగువారిని తీసుకొచ్చారని, వారిలో గుడివాడకు చెందినవారూ ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు .అనంతరపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన సూపర్‌సిక్స్ బహిరంగసభ సూపర్ హిట్ అయిందన్నారు. సమావేశంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, నాయకులు రాంబాబు, సాంబశివరావు, సత్యనారాయణ, సుధాకర్, కాశీ, దుర్గారావు, రోహిణ్‌కుమార్, శ్రీలక్ష్మి, ఇమ్మానుయేలు, కరుణకుమారి, లారా, ఆదినారాయణ, రజినీకాంత్, రమేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు వినతిపత్రం అందజేస్తున్న 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల వినతి

గుడివాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో 57 అనుసరించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, పోలీసులు, గ్రూప్-1, 2 ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కొమ్మనబోయిన లక్ష్మీశ్రీనాథ్ కోరారు. శనివారం రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో వెనిగండ్ల రాముకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం తరపున వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పోలీసులకు మేలు చేకూరేలా కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఫోరం జిల్లా కన్వీనర్ జి.జయరాజు, డీఎస్సీ సభ్యులు బెనర్జీ, జగదీష్, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గుడివాడతో సత్ఫలితాలు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అస్తవ్యస్తంగా ఉన్న తాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టామని, స్వచ్ఛ గుడివాడలో భాగంగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం 8వ వార్డులో అధికార యంత్రాంగంతో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పథకాల అమలులో సమస్యలు తలెత్తితే తనదృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, కూటమి నాయకులు దింట్యాల రాంబాబు, పంద్రాజు సాంబయ్య, ఆర్నేపల్లి పాండురంగారావు, వడ్డాది నాగరాజు, చీకటి శేషగిరిరావు, తోట వెంకటేశ్వరరావు, సయ్యద్ జబీన్, ఇమ్మానియేలు, ఏడుకొండలు, శారద, తోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 346 కేసులు పరిష్కారం



మొవ్వలో కేసులు పరిష్కరిస్తున్న జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వర్ణలత వల్లా మార్క్సు

కూచిపూడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మొవ్వ న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 346 కేసులు పరిష్కరించారు. మొవ్వ మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వర్ణలత వల్లా మార్క్సు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో పలు కేసులకు రూ.1,56,800 అపరాధ రుసుము విధించారు. రూ.53,250 సీజ్డ్ నగదు జమ అయింది. 37 కాంపౌండబుల్ కేసులు, 9 అడ్మిషన్స్, 295 ఎస్టీసీ, ఒక ఈపీ, నాలుగు ఓఎస్‌లను పరిష్కరించారు. న్యాయస్థానం పరిధిలోని కూచిపూడి, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి పోలీస్ స్టేషన్ల ఆఫీసర్లు, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

గుడివాడలో మెగా లోక్ అదాలత్

గుడివాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ దోహదపడుతుందని, కక్షిదారులు లోక్‌అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం సూచించారు. ఏలూరు రోడ్డులోని కోర్టు భవనాల సముదాయంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యులు ఎన్.దస్తగిరి, ఎన్.ప్రభాకర్, సి.హెచ్ కుటుంబరావు, కె.బాలకృష్ణ, పి.సీతారామప్రసాద్, సయ్యద్ అజీమ్ పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపిన 16 మందికి జరిమానా

గుడివాడ రూరల్: లోక్ అదాలత్‌లో గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో తాగి వాహనాలు నడిపిన 16 మందికి రూ.1,60,000 జరిమానా విధించినట్లు ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు.



మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం

మోటూరు పీహెచ్‌సీలో సదుపాయాల లేమి



మోటూరు పీహెచ్‌సీ భవనం, ప్రహరీ నిర్మించకుండా వదిలేసిన స్థలం

(ఆంధ్రజ్యోతి-గుడివాడ రూరల్): మండలంలోని 21 గ్రామ పంచాయతీల ప్రజలు మోటూరు పీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు వినియోగించుకుంటారు. అంతటి ప్రాధాన్యమున్న పీహెచ్‌సీ సదుపాయాల లేమితో కునారిల్లుతోంది. ఆరోగ్య కేంద్రంలో వసతుల లేమి కారణంగా రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య కేంద్రం చుట్టూ ప్రహరీ లేకపోవడం వల్ల పశువులు వచ్చేస్తున్నాయి. తాగుబోతులు ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో సంచరిస్తున్నారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఏదైనా సమావేశం ఏర్పాటు చేసుకోవటానికి మీటింగ్ హాలు లేదు. రోగులు ఎక్కువ మంది వస్తే వెయిటింగ్ రూమ్‌లో కష్టంగా ఉంటోంది. స్థలం సరిపోవడం లేదు. బయట పేషెంట్లు వేచి ఉండేందుకు ఒక షెడ్డు కూడా లేదు. పేషెంట్లు, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు వాహనాలు నిలుపుకోవడానికి పార్కింగ్ షెడ్డు లేదు. అధునాతన సౌకర్యాలతో ఆపరేషన్ థియేటర్, ప్రసూతి గది ఆస్పత్రిలో ఉంది. కుక్క, పాము కాటుకు కూడా మందులు అందుబాటులో ఉంటాయి. అన్నీ ఉన్నా అరకొర సదుపాయాల వల్ల పేషెంట్లు, వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద 7 సబ్ సెంటర్లు ఉన్నాయి. అందరూ వచ్చినప్పుడు సమావేశం నిర్వహించుకోవడం కష్టంగా ఉంటోందని పీహెచ్‌సీ సిబ్బంది అంటున్నారు. పీహెచ్‌సీలో క్లాస్ 4 సిబ్బంది లేరని చెబుతున్నారు. అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రానికి సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు కాలేదు

ప్రహరీ నిర్మాణానికి అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాలేదు. మీటింగ్ హాలు నిర్మాణం, పార్కింగ్ షెడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం.

- ఎంపీడీవో విష్ణుప్రసాద్



గుడ్లవల్లేరు కొత్త కాలనీలో నిలిచిన వర్షపు నీరు, ప్రధాన రహదారిపై భారీగా కురుస్తున్న వర్షం

భారీ వర్షం

● జలమయమైన పల్లపు ప్రాంతాలు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. 76 మిల్లీమీటర్ల వర్షపాతం గుడ్లవల్లేరులో నమోదయ్యింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సంత బజార్, కొత్తకాలనీలు నీటమునిగాయి.

రైతుల్లో సంతోషం

సరైన సమయంలో వర్షం కురిసిందని రైతులు చెబుతున్నారు. నిన్నటి వరకూ ఎండలు వేశాయని, వరి చేలకు వర్షం మంచిదే అని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపై నిలిచిన నీరు

గుడివాడ రూరల్: మండలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌కు ఎమ్మెల్యే కుమార్‌రాజా పరామర్శ



జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, కూటమి నేతలు

పామర్రు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో స్వీట్ షాపు దగ్ధమై భారీగా నష్టపోయిన జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తాడిశెట్టి నరేష్‌ను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శనివారం పరామర్శించారు. అధైర్యపడొద్దు..అండగా ఉంటాం అని ఆయన భరోసా ఇచ్చారు. పామర్రులో గత ఆదివారం అర్ధరాత్రి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించిన అగ్ని ప్రమాదంలో తాడిశెట్టి నరేష్‌కు చెందిన స్వీట్ షాపు దగ్ధమైంది. రూ.30 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిన సంగతి విదితమే. శనివారం నియోజకవర్గంలోని కూటమి నాయకులతో కలిసి నరేష్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందించే విధంగా సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఐదు మండలాలకు చెందిన కూటమి నాయకులు ఎమ్మెల్యే వెంట పరామర్శకు వచ్చారు.

రైతులకు సమృద్ధిగా యూరియా

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. ఆయన ప్రత్యేక చొరవతో రాష్ట్ర రైతాంగానికి అవసరమైన ఎరువులను మార్క్‌ఫెడ్, కోరమాండల్, ఇఫ్కో వంటి సంస్థల ద్వారా కూటమి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అన్ని మండలాలకు అవసరమైనంత అందుబాటులో ఉంచింది. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర ఎరువులను సమృద్ధిగా అందిస్తాం.' అని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిపక్ష వైసీపీ నేతలు యూరియా సరఫరాపై విషం చిమ్ముతున్నారని, దుష్ప్రచారాలను నమ్మొద్దని ఆయన రైతులకు సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఏఎంసీ ఛైర్మన్ జన్ను శోభన్‌బాబు, మండపాక శంకర్‌బాబు, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, వీరపనేని శివరాం, దాలిపర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఛైర్మన్‌గా అమర్‌బాబును నియమించండి



పెదపారుపూడి పీఏసీఎస్ ఛైర్మన్‌గా అమర్‌బాబును నియమించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను కోరుతున్న టీడీపీ నాయకులు

పెదపారుపూడి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి నాగేశ్వరాయ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా పాలడుగు అమర్‌బాబును నియమించాలంటూ సంఘ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు శనివారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను కోరారు. సంఘం పరిధిలోని పెదపారుపూడి, ఈదులమద్దాలి, భూషణగుళ్ల, గురువిందగుంట, మహేశ్వరపురం గ్రామాలకు చెందిన నాయకులు, రైతులు శనివారం పామర్రులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, పార్టీ నాయకులతో చర్చించి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. టీడీపీ పెదపారుపూడి గ్రామ అధ్యక్షుడు నాగన్నబోయిన గాంధీ, నాయకులు చెరుకూరి మల్లికార్జునరావు, పునుకొల్లు బెనర్జీ, చాపరాల సాంబశివరావు, పునుకొల్లు భానుప్రసాద్, అడుసుమిల్లి శ్రీనివాసరావు, రాజబాబు, కలపాల కిషోర్, గడ్డి శ్రీను, కనుమూరి ఈశ్వర్, పత్తిపాటి బాబూరావు తదితరులు ఎమ్మెల్యేను కలసిన వారిలో ఉన్నారు.



పమిడిముక్కలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద తుప్పుపట్టి మట్టిలో కలుస్తున్న చెత్త సేకరణ రిక్షాలు

ప్రజల సొమ్ము..మట్టిపాలు!

(ఆంధ్రజ్యోతి-పమిడిముక్కల): పమిడిముక్కలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద చెత్త సేకరణ రిక్షాలు నిరుపయోగంగా ఉన్నాయి. అవి తుప్పుపట్టి మట్టిలో కలసిపోతున్నాయి. గ్రామంలో ఇళ్ల నుంచి చెత్తసేకరణకు, రోడ్లు శుభ్రపరచగా వచ్చిన చెత్త తరలించేందుకు గ్రామ పంచాయతీ సమకూర్చిన ఈ వాహనాలు సమకూర్చింది. చాన్నాళ్లుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఆవరణలో పడి ఉన్నాయి. పాడైపోతున్న వాహనాలకు మరమ్మతులు చేయించి వినియోగించడమో లేదా పనికిరాకపోతే పాత ఇనుప సామాన్లకు అమ్మడమో చేసి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నార్తువల్లూరు, కుమ్మమూరు పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం



గుత్తా రామకృష్ణ(రాము), నార్తువల్లూరు పీఏసీఎస్ ఛైర్మన్



రామినేని వెంకట శేషుకుమార్(రాజా), కుమ్మమూరు పీఏసీఎస్ ఛైర్మన్

తోట్లవల్లూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నార్తువల్లూరు, కుమ్మమూరు పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను ప్రభుత్వం నియమించింది. నార్తువల్లూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా గుత్తా రామకృష్ణ(రాము), సభ్యులుగా డొక్కు చక్రపాణి, మోటూరు చింతయ్య, కుమ్మమూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా రామినేని వెంకట శేషు కుమార్(రాజా), సభ్యులుగా చొప్పరపు వెంకటేశ్వరరావు, మురాల జానకీరామయ్యలను నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుత్తా రామకృష్ణ, రామినేని వెంకట శేషు కుమార్‌లు గతంలో పీఏసీఎస్ అధ్యక్షులుగా పనిచేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా మండలి రాజేష్



అవనిగడ్డ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) రాష్ట్ర డైరెక్టర్‌గా అవనిగడ్డకు చెందిన మండలి రాజేష్‌ను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. జనసేన పార్టీలో చురుకుగా పనిచేసిన రాజేష్ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు సన్నిహితంగా ఉంటూ పార్టీ ఆదేశాల మేరకు క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. డైరెక్టర్‌గా నియమితులైన మండలి రాజేష్‌కు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్‌లు అభినందనలు తెలిపారు.

పేర్ని నానీ..కులాల మధ్య చిచ్చుపెట్టొద్దు

● డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కులాల మధ్య మాజీ మంత్రి పేర్ని నానీ చిచ్చుపెడుతున్నారని, అది మంచి పద్ధతి కాదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ హితవు పలికారు. శనివారం జనసేన కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను దూషించిన ఆర్‌ఎంపీ గిరిధర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని కోరామన్నార. పోలీసుల సమక్షంలో గిరిధర్‌పై దాడి జరిగిందనేది అవాస్తవమన్నారు. జనసేన క్రమశిక్షణ గల పార్టీ అని, 15 మంది నాయకులను సస్పెండ్ చేశారని ఆయన తెలిపారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. 11వ డివిజన్‌లో దళితులు నిర్మించిన జనసేన పార్టీ దిమ్మను కూల్చినప్పుడు దళిత నాయకులతో పాటు ఇతర నాయకులపై పేర్ని నానీ కేసులు పెట్టించారన్నారు. తోట యశ్వంత్ అనే జనసైనికుడు జడ్పీ కల్యాణ మండపంలో బంతిలో భోజనానికి కూర్చున్నప్పుడు యశ్వంత్‌పై వైసీపీ నాయకులు దాడి చేసింది వాస్తవం కాదా అని నిలదీశారు. 2వ డివిజన్‌లో యాదవ యువకుడిని పట్టుకుని కొడితే అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కరగ్రహారం, శారదానగర్‌లో ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించారన్నారు. ఘర్షణలను కులాలను ఆపాదించి లబ్ధి పొందాలనుకోవడం పేర్ని నానీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వైసీపీ నాయకులను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు చిత్తుగా ఓడిస్తారన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, పెదయాదర సర్పంచ్ గళ్లా తిమోతి, ఉడుమల బుజ్జి, జన్ను నాగరాజు, హేమశ్రీ పాల్గొన్నారు.

రాజధానిపై వైసీపీ దొంగ నాటకాలు

● టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజధానిపై వైసీపీ నాయకులు మరోసారి దొంగనాటకాలు ఆడుతున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ ధ్వజమెత్తారు. శనివారం ఆర్ అండ్ బీ గెస్టుహౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధానిపై మూడు ముక్కలాట ఆడినందుకే వైసీపీని ప్రజలు ఛీదరించి చిత్తుగా ఓడించారన్నారు. రాజధాని రైతులు, మహిళలపై జగన్ పెట్టిన కేసులు ఇంకా మర్చిపోలేదన్నారు. రాజధానిని సర్వనాశనం చేసి, ఇప్పుడు గుంటూరు- విజయవాడ మధ్య రాజధాని నిర్మిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతి రాజధానిని కొత్త నగరంగా దేశానికి తలమానికంగా నిర్మించాలన్న చంద్రబాబు సంకల్పం ఎంతో గొప్పదన్నారు. అమరావతి రాజధానిని, పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోందన్నారు. వైసీపీ పాలనలో అమరావతిపై విషం చిమ్మారని, ఐదేళ్లు అమరావతిని పాడుపెట్టి పూర్తిగా సర్వనాశనం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో మూడు ముక్కలాట ఆడి, ఇప్పుడు ఆ భవనాలు చాలు కొత్తవి అవసరం లేదని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచేనాని, టీడీపీ నాయకులు పీవీ ఫణికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.రామారావు

పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించి ఉపాధ్యాయులు, ఉద్యోగులకు న్యాయం చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.రామారావు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండురంగప్రసాద్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు ఉపాధ్యాయ సమస్యలపై ప్రసంగించారు. ఆదివారం గొడుగుపేటలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు.

సిలికానాంధ్ర వైద్యసేవలు అభినందనీయం

ఘంటసాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవి వైద్యశాల అందిస్తున్న వైద్యసేవలు అభినందనీయమని శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ బండి పరాత్పరరావు పేర్కొన్నారు. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణ మండపంలో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ప్రసూతి, జనరల్, దంత, కంటి విభాగాల వైద్యులు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లో ఒమేగా అనూ హాస్పిటల్స్, ఉదయపు నడక మిత్రమండలి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య సేవా శిబిరం నిర్వహించారు. 200 మందికి మధుమేహం, రక్తపోటు, ఈసీడీ, 2డీ ఎకో వైద్య పరీక్షలు చేశారు. ఐ కేర్ ఆప్టో మెట్రిస్ట్ అజయ్‌కుమార్ కంటి పరీక్షలు చేశారు. మిత్రమండలి అధ్యక్షుడు జల్లు మురళీనాథ్, కార్యదర్శి ఘంటసాల రాము, వేదనరసింహం, జోన్ చైర్మన్ కారుమూరి రాజేంద్రప్రసాద్, పూర్వ డిప్యూటీ గవర్నర్ వై.జగన్మోహనరావు, లంకిశెట్టి తాండవకృష్ణ, సంధ్య పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

● తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత

నాగాయలంక, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో మగవారితో అన్ని రంగాల్లో మహిళలు పోటీ పడుతున్నారని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. బాల్య వివాహాలు చేయొద్దని తల్లులకు ఆమె సూచించారు. సాల్వేషన్ ఆర్మీ ఆధ్వర్యంలో దీనదయాళపురంలో శనివారం ఆడపిల్లల సంరక్షణపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతులను ఆత్మ గౌరవంతో బతికేలా ప్రోత్సహించాలన్నారు. ఎక్సైజ్ సీఐ గిరిజ, బి.శశికళ తదితరులు ఆడ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మాట్లాడారు. సాల్వేషన్ ఆర్మీ నిర్వాహకురాలు టీడీఆర్ కుమారి అధ్యక్షత వహించారు.

వృద్ధాశ్రమంలో ఆహారం అందజేత

నాగాయలంక, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వేత్త, కూటమి నాయకుడు విక్కుర్తి శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం వీఎస్సార్ యువసేన ఆధ్వర్యంలో నాగాయలంక వృద్ధాశ్రమంలో భోజనాలు సమకూర్చారు. విక్కుర్తి శ్రీనివాసరావు సోదరుడు విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీనివాసరావు, వి.రాజా వృద్ధులకు భోజనాలు అందించారు. వారికి ఆశ్రమ నిర్వాహకుల తరఫున తలశిల రఘుశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఐహెచ్‌ఆర్సీ సెక్రటరీగా అజీమ్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ(ఐహెచ్‌ఆర్సీ) సెక్రటరీగా అబ్దుల్ అజీమ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ముర్షద్ పీర్ ఖాద్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీమ్ మీడియాతో మాట్లాడారు. కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడంతో పాటు మానవ హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.





బందరులో నీటమునిగిన లక్ష్మీటాకీసు రోడ్డు, జడ్పీ కార్యాలయం వద్ద నిలిచిన నీరు





కోడూరు గొల్లపాలెం రోడ్డు ప్రధాన కూడలిలో, మూడవ వార్డులో రోడ్డుపైన నిలిచిన వర్షపు నీరు

భారీ వర్షం..రోడ్లు జలమయం

మచిలీపట్నం టౌన్/కోడూరు/మోపిదేవి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ ముంపునకు గురయ్యాయి. మచిలీపట్నం కోనేరుసెంటర్, రేవతీ సెంటర్, లక్ష్మీటాకీసు సెంటర్, జిల్లాపరిషత్ సెంటర్‌లో రోడ్లపైన భారీగా వర్షపునీరు చేరింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. డ్రెయిన్లలో సిల్టు తీసే ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో రోడ్లపై నీరు నిలుస్తోంది.

పొంగిన డ్రైనేజీలు

కోడూరులో పలు డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. కోడూరు 3, 5 వార్డుల మధ్య ఉన్న ప్రధాన డ్రెయినేజీ పొంగి గొల్లపాలెం రోడ్డు ప్రధాన కూడలిలో నీళ్లు నిలిచాయి. కోడూరు తూర్పువైపున బస్టాండ్ వద్ద జలమయంగా మారింది. గ్రామ పంచాయతీ అధికారులు డ్రెయినేజీ పూడికతీత పనులు చేయించి వర్షపు నీరు నిల్వకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజా జీవనానికి ఇబ్బందులు

మోపిదేవిలో ప్రధాన రహదారిపై మోకాళ్లలోతు నీళ్లు నిలిచాయి. వెంకటాపురం, రావివారిపాలెం, కొక్కిలిగడ్డ గ్రామాల్లోని అంతర్గత రహదారుల వెంబడి డ్రెయినేజీ సౌకర్యం లేకపోవటంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచి ప్రజల జీవనానికి ఇబ్బంది కలిగింది.

తెప్పరిల్లిన రైతులు

అవనిగడ్డ: నాలుగు రోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిన దివి ప్రాంత రైతులు శనివారం కురిసిన భారీ వర్షంతో తెప్పరిల్లారు. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురవటంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్న రైతుల్లో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విడవకుండా వర్షం కురవడంతో జనజీవనానికి ఇబ్బందులు కలిగాయి.



మోపిదేవిలో రహదారిపై నిలిచిన నీరు

లోక్ అదాలత్‌కు విశేష స్పందన





అవనిగడ్డ, బంటుమిల్లిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారులు

అవనిగడ్డ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. శనివారం రాత్రి 8 గంటల వరకు 400లకుపైగా కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. జిల్లా అదనపు జడ్జి పాండురంగారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.అరుణ, వీడీఎం స్వర్ణలత పాల్గొన్నారు. రాజీ పడదగ్గ కేసుల్లో కక్షిదారులు పట్టుదలకు పోకుండా రాజీపడటం ద్వారా ఇరువర్గాలకు మేలు చేకూరుతుందని సూచించారు. అవనిగడ్డ బార్ అసోసియేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బంటుమిల్లి: మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ఫస్ట్ క్లాస్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎం.భాస్కరరావు ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 41 క్రిమినల్ కేసులు, 2 సివిల్ కేసులు, ఎస్టీసీ 47, పీఎల్సీ 2 పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల సోమశేఖర్, పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

మచిలీపట్నం టౌన్: జిల్లా కోర్టు వద్ద లోక్ అదాలత్‌కు వచ్చిన కక్షిదారులకు కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

మహనీయుడు మండలి వెంకటకృష్ణారావు



అవనిగడ్డలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దివిసీమ అభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు అని కొత్తపేట పీఏసీఎస్ చైర్మన్ యలవర్తి రాజ నాగమునేశ్వరరావు(చిన్నా) అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల్లో భాగంగా శనివారం వంతెన సెంటర్‌లో కృష్ణారావు విగ్రహానికి రామకోటిపురం, కొత్తపేట గ్రామాల కూటమి నాయకులు, మండలి అభిమానులతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఏఎంసీ వైర్మన్ రాజనాల వీరబాబు, జిల్లా కర్రసాము అసోసియేషన్ అధ్యక్షుడు సింహాద్రి పవన్, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), అన్నపరెడ్డి రామదాసు, విశ్వనాథపల్లి పాప పాల్గొన్నారు.

నాగాయలంక: దివంగత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల సందర్భంగా శనివారం 41వ రోజున నాగాయలంకలో కృష్ణారావు విగ్రహానికి కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, గుడివాక శివరావు, గుడివాక శివాజీ, చన్నగిరి లతామోహన్, తాడేపల్లి వెంకట పాపారావు, తోట మానస, తానంకి చంటి, ముక్కోల్లు శివరావు, తలశిల రామకృష్ణ, షేక్ జానీ, సబ్బినేని మహేష్, తలశిల శివరామకృష్ణ పాల్గొన్నారు.



విశ్వనాథపల్లి పీఏసీఎస్ వద్ద రైతులకు యూరియా అందిస్తున్న ఏవో శ్రీధర్



కొక్కిలిగడ్డలో రైతులకు యూరియా అందిస్తున్న సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు

రైతులకు యూరియా పంపిణీ

కోడూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని ప్రస్తుతం పీఏసీఎస్‌లు, ప్రైవేట్ దుకాణాల వద్ద యూరియా అందుబాటులో ఉందని ఏవో ఎం.శ్రీధర్ తెలిపారు. శనివారం ప్రైవేట్ దుకాణాలు, పీఏసీఎస్‌ల ద్వారా 1258 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేశామన్నారు. ప్రతీ రైతుకూ యూరియా సరఫరా చేశామని, ఎవరికైనా అందకపోతే వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. విశ్వనాథపల్లి పీఏసీఎస్ వద్ద యూరియాను పంపిణీ చేశారు.

కొక్కిలిగడ్డలో..

మోపిదేవి: కొక్కిలిగడ్డ పీఏసీఎస్ వద్ద కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక గ్రామాల రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్‌కు వరి, మాగాణి పంటలకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని ఏవో కె.హెబ్సిబా రాణి తెలిపారు. ప్రస్తుతం 15 టన్నుల యూరియా కొక్కిలిగడ్డకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని బాబూరావు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, బొబ్బర్లంక టీడీపీ నాయకులు దొప్పలపూడి జగదీష్, కోనేరు నాగేశ్వరరావు, పీఏసీఎస్ సీఈవో మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేత

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బందరు మండలం జొన్నలవారిపాలెం నివాసి దింటకుర్తి వీరబాబు శనివారం మృతి చెందారు. కానూరు పీఏసీఎస్ తరఫున తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ప్రతాప్ నరేష్‌కుమార్‌లు మృతుడు వీరబాబు కుమారుడు దింటకుర్తి జోజిబాబుకు మట్టిఖర్చుల నిమిత్తం రూ.పది వేలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ అడపా శ్రీనివాసరావు, జొన్నలగడ్డ బాబూరావు, గోపు వెంకటరమణ, దింటకుర్తి బాలాజీ, జొన్నల జోజి, రామకృష్ణ, కొప్పినేటి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గూడూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మల్లవోలు గ్రామానికి చెందిన షేక్ జిలానీ కిడ్నీ వ్యాధితో మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ రూ.5 వేలు అందించింది. పడవల మోహన్ త్రినాథ్, కోలా వాసు పాల్గొన్నారు.

కుర్చీలు, ఫ్యాన్లు వితరణ

చల్లపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ పార్కులోని ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నడుపుతున్న కళావేదికకు వ్యాపారి వేముల పాండురంగారావు 20 కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్లను శనివారం బహూకరించారు. కళాపరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు పౌరాణిక నాటకాలు ప్రాక్టీస్ చేసుకుంటూ కళాప్రదర్శనలు ఇస్తున్నారు. కళాకారుల సౌకర్యార్థం పాండురంగారావు కుర్చీలు, ఫ్యాన్లు అందించారు. కళాపరిషత్ అధ్యక్షుడు బోలెం రామారావు, కార్యదర్శి ముమ్మనేని సన్నీ, సహాయ కార్యదర్శి ఉప్పల సాంబశివరావు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర

బంటుమిల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రామవరప్పుమోడీలో గ్రామదేవత గంగానమ్మ, పోతురాజు, చల్లాలమ్మ, మారెమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం జలబిందెల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.